క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు



స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ సలీంను సత్కరిస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి. పురుషోత్తమన్‌ను స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ, మిత్రపక్ష నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలోని డైరెక్టర్ చాంబర్‌లో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు, చీకటి శ్రీనివాస్, మోహన్‌బాబు, కాండ్రేగుల శ్రీనివాస నాయుడు, దొమ్మేటి అప్పారావు, ప్రసన్నకుమార్, వరసాల శ్రీనివాస్, బి. డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పతకాల పంట



పతకాలతో భాస్కరరావు

పెదగంట్యాడ: మేనేజ్‌మెంట్ మెంబర్స్ 7వ జాతీయ మాస్టర్ గేమ్స్–2025లో ఉక్కు ఉద్యోగి మరల భాస్కరరావు పతకాల పంట పండించారు. మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం రూర్కెలాలోని బిర్సా ముండా అథ్లెటిక్స్ స్టేడియంలో ఈ నెల 6 నుంచి 9వరకూ నిర్వహించిన పోటీల్లో ఆయన సత్తా చాటారు. షాట్‌పుట్ 60 ఏళ్ల విభాగంలో 4కిలోల గుండును 11.48 మీటర్లు విసిరి బంగారు పతకాన్ని కైవసం చేసుకొన్నారు. అలాగే పవర్ లిఫ్టింగ్ 83 కిలోల విభాగంలో బ్యాక్ స్క్వాడ్ బెంచ్ ప్రెస్‌లో 140 కిలోలు, డెడ్ లిఫ్ట్ 85 కిలోల విభాగంలో 145 కిలోల బరువులెత్తి బంగారు పతాకం సాధించారు. హేమర్ త్రోలో 18.96 మీటర్లు విసిరి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. పెదగంట్యాడకు చెందిన మరల భాస్కరరావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూనే మరొపక్క క్రీడాపోటీల్లో సత్తా చాటడంతో పలువురు అభినందిస్తున్నారు.

సావిత్రి బాయి పూలే సేవలు మరువలేం



సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జాగరపు శ్రీను తదితరులు

పెదగంట్యాడ: సావిత్రిబాయి పూలే సేవలు మరువలేమని బీసీ సెల్ అధ్యక్షుడు జాగరపు శ్రీను అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని సోమవారం కోరాడ కూడలి వద్ద ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాగరపు ముసలి నాయుడు, గురయ్య, తోకాడ అప్పారావు, జాగరపు శేఖర్, దల్లి గురుమూర్తి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్‌బీఐ సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. పెదగంట్యాడ పాత అయ్యన్నపాలేనికి చెందిన గొందేశి పెంటయ్యరెడ్డి (26) ఈనెల 4న రాత్రి ఇంటి నుంచి స్కూటీపై బయటకు వెళ్లాడు. రాత్రి 12.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పెంటయ్యరెడ్డి ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద పడి ఉన్నాడని తెలిపారు. వెంటనే పెంటయ్యరెడ్డి తమ్ముడు మణికంఠ స్నేహితులతో సంఘటనా స్థలానికి వెళ్లి పెంటయ్యరెడ్డిని ఇంటికి తీసుకు వచ్చారు. అతడి ఎడమ చేతిపై స్వల్ప గాయం తప్పా మరే గాయాలు లేవు. అయితే మరుసటి రోజు వాంతులు కావడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఈడ్ మూల్యాంకన కేంద్రం పరిశీలన

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడ్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనం జరుగుతున్న కేంద్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు సోమవారం పరిశీలించారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో 57 కళాశాలలకు సంబంధించిన బీఈడ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఏయూలో జరుగుతోంది.

మేము అధికారంలోకి వస్తే ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తాం.. కార్డు దారులకు అన్ని సరకులు ఇస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత బహిరంగ మార్కెట్‌లో ధరల మోత మోగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరో వైపు పప్పుల ధరలకు రెక్కలు రావడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. రేషన్ ద్వారా ఇచ్చే కందిపప్పు కోసం కార్డుదారులు ఎదురు చూస్తున్నారు. అయినా కూటమి సర్కారు కరుణించలేదు. రెండు నెలల కందిపప్పు ఇవ్వలేదు. మరో వైపు పంచదార కూడా అందరికీ అందలేదని కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు. కందిపప్పు సరఫరా ఉన్నట్టా.. లేనట్టా అని మండిపడుతున్నారు. –పెదగంట్యాడ

2 నెలలు అందించని వైనం..

పంచదార కూడా అరకొరే..

కందిపప్పు లేనట్టేనా!





పెదగంట్యాడలో ఎండీయూ వాహనం వద్ద సరకులు తీసుకుంటున్న కార్డుదారులు

బహిరంగ మార్కెట్‌లో ధరల మంట

ఇబ్బందులు పడుతున్న పేదలు

మండలంలోని తెల్లకార్డులు **32,825**

పౌర సరఫరాల **శాఖ ద్వారా పంపిణీ చేసే** కందిపప్పును విని**యోగించుకుందామని తెల్ల** రేషన్ కార్డుదారులు ఆలోచిస్తుంటే.. ప్రభుత్వం వారి ఆశల పై నీళ్లు చల్లింది. జనవరి నెలలో కొద్ది మందికి కందిపప్పు పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో బియ్యం,కొంతమందికి పంచదార పంపిణీ చేశారు. మార్చిలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురు చుశారు. ఈ **నెలలో కందిపప్పు సరఫరా చేయకపోవడంతో తెల్లకార్డు దారులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. బయట** మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ. 180 పలుకుతోంది. రేషన్ ద్వారా కిలో రూ.67కి లభిస్తుండంతో కార్డుదారులు కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు.

బియ్యంతో సరిపెట్టుకో..!

ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు కేంద్ర **ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు** రాయితీ ధరలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత సరకులు సక్రమంగా ఇవ్వడం లేదు. ఈ నెలలో బియ్యంతో సరిపెట్టుకో అన్నట్టుగా బియ్యం తప్పా పంచదార, కందిపప్పు ఇవ్వలేదు. దీంతో స్థానికులు ఎండీయూ వాహనదారులను నిలదీ స్తున్నారు.

పేదలపై చిన్నచూపు

పెదగంట్యాడ మండల పరిధిలో **32,825 తెల్ల రేషన్ కార్డు**లు ఉన్నాయి. ఇందు**లో అధిక శాతం** మంది కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నవారే. వీరికి ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసరాలే ఆధారం. అందులో కందిపప్పు నిలిపివేశారు. పంచదార కూడా అరకొరగా పంపిణీ చేస్తూ ప్రభుత్వం పేదల పై చిన్నచూపు చూస్తోంది.

సరకులు అందక అవస్థలు



బియ్యం ఒక్కటే ఇచ్చారు. పంచదార, కందిపప్పు ఇవ్వలేదు. అసలే మార్కెట్లో నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.దీనికి తోడు ప్రభుత్వం కూడా పేదలకు రేషన్ ద్వారా సరకులు సక్రమంగా అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, ఇతర సరకులు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

–ఎం. లక్ష్మి, నడుపూరు

కందిపప్పు ఏది?



ప్రభుత్వం రేషన్ సరకులు పేదలకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోధుమ పిండి తదితర సరకులు పంపిణీ చేసింది. ప్రస్తుతం అరకొరగా సరఫరా చేస్తున్నారు. ఈ నెలైతే అసలు కందిపప్పు రాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పేదలకు అన్ని సరకులు అందేలా చర్యలు తీసుకువాలి.

– పి. రమ్య, పెదగంట్యాడ.

ఉగాదికైనా ఇస్తారా?



సంక్రాంతికి కందిపప్పు ఇస్తారనుకుంటే అప్పుడూ కొంతమందికే ఇచ్చారు. అయిపోయిందని చెప్పారు. కనీసం ఉగాది పండగకైనా కంది పప్పు ఇస్తారా..! బియ్యం, చక్కెర తప్పా ఏ వస్తువులు ఎండీయూ వాహనం ద్వారా ఇవ్వడం లేదు. ప్రభుత్వం పేదలకు అందించే సరకుల పంపిణీ విషయంలో చొరవ చూపాలి.

– సుమన్, యాతపాలెం

కందిపప్పు రాలేదు



ఈ నెల కందిపప్పు రాలేదు. కార్డుదారులకు బియ్యం, పంచదార ఇస్తున్నాం. కందిపప్పు వచ్చిన వెంటనే అందరికీ అందించేందుకు కృషి చేస్తాం.

– తవ్వా కృష్ణ, ఏఎస్‌వో, పౌరసరఫరాల శాఖ, గాజువాక

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న కమిటీపెద్దలు

కూర్మన్నపాలెం: స్థానిక లక్ష్మీకాలనీలో వెలసిన త్రిశక్తి ఆలయ ప్రధాన వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలు ఆరోగ్యంగా..హాయిగా ఉండాలని నాగిరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో 87వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్,చిత్రాడ వెంకటరమణ, సూర్యనారాయణ, ఆడారి శ్రీనివాసరావు, రమణరాజు, కనకారావు, సుబ్బరాజు, కె. లక్ష్మి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగి మోడేకుర్తికి ఏసీపీ ప్రశంస



మోడేకుర్తి సత్యనారాయణకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఏసీపీ త్రినాథ్

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జనరల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న మోడేకుర్తి వీర వెంకట సత్యనారాయణను సోమవారం సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ప్రశంసించారు. ఈ మేరకు ఆయనకు పోలీస్ విభాగం తరపున ప్రశంసాపత్రం అందజేశారు. శివరాత్రి పర్వదినం రోజు అప్పికొండ సోమేశ్వరాలయం వద్ద సముద్ర స్నానానికి వచ్చే భక్తులకు సత్యనారాయణ ఏటా స్వచ్ఛందంగా మైక్ సిస్టమ్‌ద్వారా పబ్లిక్ అనౌన్స్‌మెంట్ చేస్తూ తగిన జాగ్రత్తలు చెబుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన మహాశివరాత్రి రోజు తన సేవలు అందించారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణను సౌత్ ఏసీపీ త్రినాథ్ ప్రశంసించారు.

యువత పోరుకు తరలిరండి

మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి పిలుపు



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి, పార్టీనేతలు

పెదగంట్యాడ: యువత, విద్యార్థులకు కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని యువత, విద్యార్థులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం యువత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. గాజువాక నియోజకవర్గం నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, పల్లా పెంటారావు, ఎండీ గౌస్, బోగాది సన్నీ, నాగిశెట్టి శ్రీను, డీవీఆర్, జీలకర్ర నాగేంద్ర, తిప్పల స్వాతి, జుత్తు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

ఐలా కమిషనర్ కిశోర్



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఐలా కమిషనర్ కిశోర్ తదితరులు

కూర్మన్నపాలెం: ప్రజలకు ఇబ్బందిలేకుండా డంపింగ్ యార్డును నిర్వహిస్తామని ఐలా కమిషనర్ ఎ. కిశోర్ పేర్కొన్నారు. బయట వ్యక్తులు చెత్తవేయడం వల్ల పరిస్థితి అధ్వానంగా మారిందని చెప్పారు. ఇకపై అలాంటి అవకాశం లేకుండా యార్డు చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని ప్రకటించారు. ఈ మేరకు టెండర్స్ కూడా ఆహ్వానించామని చెప్పారు. 87వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, తిరుమలనగర్ వాసులు డంపింగ్‌యార్డు, కాలుష్యం తదితర సమస్యలను కమిషనర్‌కు వివరించారు.మురుగుకాలవలు నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక నిపుణులతో తగిన ప్రతిపాదనలు రూపొందించి ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా చూస్తామన్నారు. సెల్ టవర్ ఏర్పాటు విషయంలో నోటీసులు అందజేశామని, త్వరలో తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుమల నగర్ అసోసియేషన్ పెద్దలు పరమానందం,పరమేశ్వరరావు, సన్యాసిరావు,సుగుణ, ఈశ్వరరావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమారామలింగేశ్వరస్వామి పరస



పరసలో భక్తుల సందడి



పరసలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరసను ఘనంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. భక్తులు మహా శివునికి రుద్రాభిషేకం చేశారు. పరసను పురస్కరించకొని ఏర్పాటు చేసిన తప్పెట గుళ్ల, కోలాట పోటీలు, స్టేజీ ప్రోగ్రాంలు ఉత్సాహంగా సాగాయి. పెద్ద సంఖ్యలో భక్తుల జాతరలో పాల్గొన్నారు.

సమాచార భద్రత ఎంతో కీలకం

ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: సైబర్ చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏయూ న్యాయ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న వారం రోజుల ఫ్యాకల్టీ అప్డేషన్ ప్రోగ్రాం (ఎఫ్‌యూపీ)ను సోమవారం ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ సమాచార గోప్యత అనేది ఎంతో కీలకమని చెప్పారు. సాంకేతిక, న్యాయ నిపుణులు సమష్టిగా పనిచేస్తూ సైబర్ భద్రతను పెంపొందించే విధంగా కృషి జరగాలని సూచించారు. భారతదేశంలో ప్రతి నిమిషం వందలాది సైబర్ దాడులు చోటు చేసుకుంటున్నాయని, ఇది సమస్య తీవ్రతకు అద్దం పడుతోందని చెప్పారు. విద్యావంతుల్లో సైతం సైబర్ చట్టాలపై అవగాహన కొరవడిందన్నారు. న్యాయ విద్యార్థులు ముఖ్య భూమిక పోషిస్తూ ప్రజలను ఈ దిశగా చైతన్యవంతం చేయాలని సూచించారు. సమ్మిళిత ఆలోచనలతో పని చేస్తూ సమర్థవంతమైన పరిష్కారాలను అందించాల్సిన అవసరాన్ని వివరించారు.

హయ్యర్ పెన్షన్ సాధనకు కృషి



గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సమావేశమైన భెల్ విశ్రాంత ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) 95 హయ్యర్ పెన్షన్ సాధన కోసం కార్యాచరణ చేపట్టాలని భెల్ ఉద్యోగులు నిర్ణయించారు. భెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సోమవారం సంస్థ విశ్రాంత అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమావేశమయ్యారు. సీనియర్ విశ్రాంత ఉద్యోగి ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ ఈపీఎస్ 95 హయ్యర్ పెన్షన్‌కు సంబంధించిన జాయింట్ డిక్లరేషన్ ఫాంను విశాఖపట్నం పీఎఫ్ కమిషనర్‌కు భెల్ మేనేజ్‌మెంట్ ద్వారా పంపించామన్నారు. అయితే ఈపీఎస్ 95 హయ్యర్ పెన్షన్‌కు సంబంధించిన దరఖాస్తులను పీఎఫ్ కమిషనర్ కొన్ని అభ్యంతరాలు తెలుపుతూ వెనక్కి పంపించారన్నారు. ఈపీఎస్ 95 నేషనల్ యాజిటేషన్ కమిటీ కార్యదర్శి అప్పారావు, అధ్యక్షుడు ఉరుకూటి బాబూరావు, అలమండ వెంకటేశ్వరరావు, అచ్చంనాయుడు మాట్లాడుతూ భెల్ స్థానిక మేనేజ్‌మెంట్ సహకారంతో గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్ సహకారంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ద్వారా హయ్యర్ పెన్షన్ సాధించుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు.

పోలీస్ బ్యాండ్ గదుల ప్రారంభం



నూతన గదులను ప్రారంభించిన సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ బ్యాండ్ కోసం పోలీస్ బ్యారెక్స్‌లో నూతనంగా నిర్మించిన గదులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ప్రారంభించారు. పోలీస్ కార్యక్రమాలు, పలు జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు బ్యాండును అందించేందుకు 19 మంది సభ్యులతో పోలీస్ బ్యాండ్ ఉంది. సీపీ గతంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పర్యటనలో నగర పోలీసు బ్యాండు గది శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అదే ప్రాంగణంలో నూతన గదులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే గదులను నూతనంగా నిర్మించారు. బ్యాండ్ ప్రాక్టీస్ కోసం ఒక గదిని, వారు ఉండేందుకు మరో ఏసీ గదిని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నగరంలో పోలీస్ సంబంధిత కార్యక్రమాలకే కాకుండా, అంతర్జాతీయ కార్యక్రమాలకు అనువుగా బ్యాండ్ నిర్వహించేందుకు అవసరమైన సంగీత పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తగా హోంగార్డులను నియమించేందుకు అధికారులకు లేఖ రాస్తానన్నారు.

తగలబెట్టేస్తున్నారు



రాంనగర్ వద్ద యూపీహెచ్‌సీ మార్గంలో వ్యర్థాలు తగలబెట్టడంతో వెలువడుతున్న పొగ

అక్కిరెడ్డిపాలెం: కొందరు పరిశ్రమల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డంపింగ్‌యార్డుకు తరలించాల్సిన వ్యర్థాలను ఇష్టానుసారంగా తగులబెట్టడంతో పొగ వ్యాపించి కాలుష్యం కమ్ముతోంది. ఆటోనగర్ రాంనగర్‌లోని ఎ – బ్లాక్‌లో సోమవారం యూపీహెచ్‌సీ రోడ్డులోని కొన్ని పరిశ్రమలకు చెందిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తగులబెట్టించారు. దీంతో భారీగా మంటలు చెలరేగి దట్టమైన పొగ అలుముకుంది. దీంతో మింది నుంచి రాంనగర్ ప్రధాన రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులు పొగను గమనించి అగ్నిప్రమాదం చోటు చేసుకుందా అని ఆందోళనకు గురయ్యారు. వ్యర్థాలను తొలగించాల్సిపోయి ఇలా తగులబెట్టడం ఏంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4వేల పెన్షన్ వర్తింపజేయాలి

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న పింఛన్ మాదిరిగానే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ.4 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఏవీ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీకే రాయ్, ఉపాధ్యక్షులు సీహెచ్. పైడిరాజు రెడ్డి, బొడ్డేటి జగతరావు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ రీజియన్ నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహ వద్ద భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించినప్పటికీ స్పందన లేదన్నారు. కనీసం వృద్ధులకు ఇస్తున్న రూ.4వేలు పెన్షన్ అయినా వర్తింపజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి ఈ నెల 14న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టి ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయనున్నామని వెల్లడించారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ఈశ్వరరావు, కోశాధికారి ఎం. జగ్గారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.ఎస్.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఏ వైస్ చైర్మన్‌గా పరమేశ్వరరావు



ఎంవీపీకాలనీ: ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ (ఏపీఈఏ) వైస్ చైర్మన్‌గా ఆచార్య కె.పరమేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం విశ్రాంత ఆచార్యుడైన ఆయనకు విజయవాడలోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇటీవల జరిగిన అసోసియేషన్ 41వ వార్షిక సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఆయన సోమవారం తెలిపారు. ఆచార్య పరమేశ్వరరావు గతంలో ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (ఐఈఏ)కు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలు అందించారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాపై ఉపయోగిస్తున్నారన్నారు.